సాక్షి
మహబూబాబాద్

బుధవారం । 26 । జూలై । 2023



పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వండి

మానుకోట పటణంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. - 9లో▸



విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయం

- 9లో▸

విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జీవుజాత కార్యక్రమం చేపట్టామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మధు అన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0^0 /22.7^0

జిల్లాలో ఉదయం నుంచి వర్షం కురుస్తుంది. భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వర్షాలు తగ్గిన వెంటనే కాల్వల మరమ్మతులు

సాక్షి స్పందన

బయ్యారం: వర్షాలు తగ్గిన వెంటనే బయ్యారం పెద్దచెరువు కాల్వల మరమ్మతులు చేపడతామని ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసాచార్యులు అన్నారు. మంగళవారం సాక్షి దినపత్రికలో 'కట్ల తీగలు.. ముళ్ల పొదలు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. టెండర్ ప్రక్రియ ఆలస్యం కావడం వల్ల సకాలంలో పనులు ప్రారంభించలేకపోయామని, ప్రస్తుతం టెండర్ పూర్తయిందన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా సాగు నీరు అందిస్తామన్నారు.

నాణ్యమైన విద్యకు 'తొలిమెట్టు'

డీఈఓ రామారావు



మహబూబాబాద్ అర్బన్: తొలిమెట్టు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని డీఈఓ రామారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం తొలిమెట్టు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ హాజరై మాట్లాడారు. విద్యార్థుల ఎదుగులకు పాఠశాల విద్య కీలకమన్నారు. విద్యార్థుల బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థులు ఇంగ్లిష్‌లో మాట్లాడేలా తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వం నుంచి విద్యార్థులకు ఉచిత ఏకరూప దుస్తులు, పుస్తకాలతో పాటు నోట్‌బుక్‌లు అందజేస్తున్నామన్నారు. ప్రభుత్వ బడుల బలోపేతానికి ఉపాధ్యాయుల కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ పూల్‌చంద్, కో డైరెక్టర్లు శీలం వెంకటేష్, మురళి, ఆర్పీలు ప్రవీణ్, నాగముని, మహేష్, యాదగిరి, రమేష్, సారంగం తదితరులు పాల్గొన్నారు.

నిట్‌కు బాధ్యతగా సేవ చేయాలి

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో విద్యనభ్యసించి సివిల్ సర్వీస్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు తమ కళాశాల రుణం తీర్చుకునేందుకు కళాశాలకు సేవ చేయాలని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ అన్నారు. కాజీపేటలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)లోని సెమినార్ హాల్ కాంప్లెక్స్‌లో మంగళవారం సివిల్ సర్వీసెస్ (యూపీఎస్సీ)–22లో ర్యాంకులు సాధించిన నిట్ విద్యార్థులకు నిట్ అల్యుమ్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ పాల్గొని ర్యాంకర్లను సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో ప్రత్యేకతను చాటుకుంటున్న నిట్ వరంగల్‌లో విద్యనభ్యసించి, కళాశాలకే గౌరవంగా నిలుస్తూ సివిల్ ర్యాంకులు సాధించడం అభినందనీయమన్నారు. నిట్ విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్‌లో రాణిస్తూ రాబోయే తరాలకు ఆదర్శంగా నిలుస్తారన్నారు. నిట్‌కు చెందిన ఆవుల సాయికృష్ణ ఏఐఆర్–94వ ర్యాంకు ఐఏఎస్, అచ్యుత్ అశోక్ 190వ ర్యాంకు ఐపీఎస్, ఎప్పలపల్లి సుస్మిత 384వ ర్యాంకు, మనోజ్ 559వ ర్యాంకు ఐఏఎస్, అనురాగ్ 524వ ర్యాంకు ఐఆర్ఎస్, తుమ్మల సాయికృష్ణారెడ్డి 640వ ర్యాంకు ఐఏఎస్, అభిజయ్ పగారే 844వ ర్యాంకు ఐసీఏఎస్‌లకు ఆన్‌లైన్‌లో సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. యూపీఎస్సీలో 464వ ర్యాంకు సాధించి ఐఆర్ఎస్‌కు ఎంపికైన సమీర్‌రాజును నిట్ డైరెక్టర్ ఘనంగా సన్మానించి, మెమొంటోతో సత్కరించారు.

డీఆర్ఎంకు నాయకుల వినతి

కాజీపేట రూరల్: సికింద్రాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ భరతేశ్‌కుమార్‌జైన్‌ను మంగళవారం ఆల్ ఇండియా రైల్వే ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. రైల్వే ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ, జోనల్ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నపురం రాజశేఖర్, ప్రెసిడెంట్ బి.వీరన్న, అసిస్టెంట్ డివిజన్ సెక్రటరీ, కాజీపేట ఆపరేటింగ్ అండ్ కమర్షియల్ బ్రాంచ్ సెక్రటరీ కెఎస్.రావు, కాజీపేట ప్రెసిడెంట్ ఆర్.కుమారస్వామి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బి.మోతీలాల్, లోకో బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ బి.మురళీకృష్ణ, వీరస్వామి కలిసి సన్మానించారు. రైల్వే ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ పెండింగ్ సమస్యల్ని పరిష్కరించాలని, రైల్వేలో ఎస్సీ, ఎస్టీ బ్యాగ్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయాలని వినతిపత్రం అందించినట్లు కేఎస్.రావు తెలిపారు.

దంచికొట్టిన వాన

జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు
- ఉప్పొంగుతున్న వాగులు, వంకలు
- లో లెవల్ బ్రిడ్జిలపై నుంచి వరదనీరు
- ఏజెన్సీలో నిలిచిపోయిన రాకపోకలు
- పలుచోట్ల కూలిన పాతఇళ్లు



నర్సింహులపేట: బ్రిడ్జి పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న ఆకేరు వాగు

సాక్షి, మహబూబాబాద్: జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి.జిల్లాలోని ఆకేరు, మున్నేరు, పాలేరు, వట్టివాగు, రాళ్లవాగు, పెదవాగు, పాకాల ఏరు పొంగిపొర్లుతున్నాయి. దీంతో ఏజెన్సీలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గార్లలో పాకాల ఏరు ప్రవాహంతో రాంపురం, మద్దివంచ గ్రామాలకు రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. అలాగే లో లెవల్ బ్రిడ్జిల పైనుంచి వరద ప్రవాహం కొనసాగుతుండగా.. రాకపోకలను అధికారులు నిలిపివేశారు. పాతఇళ్లు కూలిపోయి బాధిత కుటుంబాలు వర్షంలో బిక్కుబిక్కుమంటున్నాయి.

కుండపోత..

జిల్లాలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు 16.62 సెంటిమీటర్ల వర్షం కురవగా.. సగటున 10.2సెంటిమీటర్లు నమోదైంది. మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, చెరువులు తెగిపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు సిబ్బందిని ఆదేశించారు.

పొంగుతున్న వాగులు..

బయ్యారం మండలం మొట్ల తిమ్మాపూర్ వద్ద వట్టివాగు ప్రవాహంతో రాకపోకలు నిలిచిపోయాయి. తొర్రూరు మండలంలోని గుర్తూరు వద్ద ఆకేరు వాగు ఉధృతితో తొర్రూరు నుంచి అన్నారం షరీఫ్ రోడ్డుపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నర్సింహులపేట మండల కేంద్రం నుంచి మహబూబాబాద్ వెళ్లే దారిలో కౌసల్యదేవిపల్లి వద్ద లోలెవల్ బ్రిడ్జి పైనుంచి ఆకేరువాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నెల్లికుదురు–బ్రాహ్మణకొత్తపల్లి గ్రామాల మధ్య వాగులు పొంగడంతో ఆ రెండు గ్రామాలకు రవాణా వ్యవస్థ స్తంభించింది.పెద్దముప్పారం, జంగిలిగొండ పెద్దచెరువు, కొమ్ములవంచ కొచ్చెరువు, కురవి నల్లెల చెరువు పొంగడంతో ఆయా గ్రామాల నుంచి వాహనాలపై వచ్చేవారు ఇబ్బందులు పడ్డారు.

కూలిన ఇళ్లు..

కొత్తగూడ మండలం గాంధీనగర్‌లో మోదె నర్సమ్మ ఇల్లు, గూడూరు మండలం గాజులగట్టు శివారు ఇప్పల్‌తండాలో బోడ శాంతి ఇల్లు, గార్ల మండలం గోపాలపురం గ్రామానికి చెందిన కాంపాటి లక్ష్మి ఇల్లు కూలిపోయింది. జిల్లాలో వర్షాభావ పరిస్థితులను మంత్రి సత్యవతిరాథోడ్ పరిశీలించారు. మరిపెడ మండలం పురుషోత్తమయగూడెంలోని బ్రిడ్జి నుంచి ఆకేరు వాగు ఉధృతిని పరిశీలించారు. పలు ప్రాంతాల్లో కలెక్టర్, ఎస్పీ పర్యటించి పరిశీలించారు.



మరిపెడ రూరల్: పురుషోత్తమాయగూడెం బ్రిడ్జి వద్ద ఆకేరు వాగు ఉధృతిని పరిశీలిస్తున్న మంత్రి



కొత్తగూడ: కొత్తపల్లి వాగు దాటుతున్న విద్యార్థులు



ముడుపుగల్లులో చేపలు పడుతున్న యువకులు

వర్షపాతం వివరాలు (మి.మీలో)

మండలం	నమోదైన వర్షపాతం
కొత్తగూడ	74.8
గంగారం	76.6
బయ్యారం	66.8
గార్ల	90.8
డోర్నకల్	119
కురవి	93.4
మహబూబాబాద్	108.6
గూడూరు	94
కేసముద్రం	107.6
నెల్లికుదురు	124.6
నర్సింహులపేట	94
చిన్నగూడూరు	125.2
మరిపెడ	138.2
దంతాలపల్లి	102.2
తొర్రూరు	134.2
పెద్దవంగర	112.4

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

మీనం.. ఘనం..

- 8లో▸

చెరువులకు జలకళ

జిల్లాలో 1,594 చెరువులకు వర్షాలతో నిండినవి 596
- భారీగా మత్తళ్లు పోస్తున్న వైనం
- రెండు పంటలకు నీరు అందే అవకాశం
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు



మత్తడి పోస్తున్న జంగిలిగొండ పెద్ద చెరువు

మహబూబాబాద్: జిల్లాలో కురుస్తున్న వర్షాలతో చెరువులకు జలకళ వచ్చింది. జిల్లా వ్యాప్తంగా 1,594 చెరువులు ఉండగా, 596 చెరువులు నిండి మత్తళ్లు పోస్తున్నాయి. దీంతో చెరువుల కింద రెండు పంటలకు ఢోకా ఉండదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా భారీవర్షాలతో జిల్లాలోని వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

చెరువుల వద్ద అధికారుల పర్యవేక్షణ..

జిల్లాలో 1,594 చెరువులకు 596 చెరువులు నిండాయని అధికారులు చెబుతున్నారు. అవి అలుగులు పోస్తున్నాయని, వాటి చుట్టు పక్కల ఉన్న గ్రామాల్లో ప్రస్తుతం ఎలాంటి ముప్పు లేదని చెబుతున్నారు. కాగా చెరువులు, కుంటల వద్ద సిబ్బందిని ఉంచి పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. కట్టలు తెగే ప్రమాదం ఉన్న చెరువుల వద్ద తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రైతుల సంతోషం..

జిల్లాలో కురుస్తున్న వర్షాలతో పలు చెరువులు నిండి అలుగులు పారుతుండడంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చెరువుల కింద వానాకాలం, యాసంగి పంటలకు ఢోకా లేదని అంటున్నారు. ఈ మేరకు వానాకాలం వరినాట్లు ముమ్మరం చేశారు. రైతులు పనుల్లో బిజీగా మారారు.

జిల్లాలో నిండిన చెరువుల వివరాలు

మండలం	మొత్తం చెరువులు	నిండినవి
మహబూబాబాద్	87	7
దంతాలపల్లి	29	0
చిన్నగూడూరు	24	0
గూడూరు	122	19
కురవి	122	2
డోర్నకల్	69	0
మరిపెడ	69	0
నర్సింహులపేట	46	1
కేసముద్రం	68	3
నెల్లికుదురు	69	12
బయ్యారం	98	9
గార్ల	96	1
తొర్రూరు	58	43
పెద్దవంగర	43	7
కొత్తగూడ	380	297
గంగారం	214	195
మొత్తం	1,594	596

జలపాతాల హోరు

గూడూరు/బయ్యారం: భారీ వర్షాలతో జిల్లాలోని జలపాతాలు జాలువారుతున్నాయి. గూడూరు మండలంలోని భీమునిపాద జలపాతంతో పాటు బయ్యారం మండలంలోని పాండవుల జలపాతం జాలువారుతుండగా.. సందర్శకుల సందడి నెలకొంది.



జాలువారుతున్న భీమునిపాద జలపాతం



పాండవుల జలపాతం

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ శశాంక

నెల్లికుదురు: భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. మండలంలోని రావిరాల పరిధిలో రహదారిపై ప్రవహిస్తున్న వరద నీటిని ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి మంగళవారం పరిశీలించి సర్పంచ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని రామన్నగూడెం గ్రామ పరిధిలో ఉరకలేస్తున్న ఆకేరు వాగు ప్రవాహాన్ని పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షితప్రాంతాలకు తరలించాలన్నారు. వరద ఉధృతిపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధాన రహదారులపై వరద ప్రవాహం ఎక్కువైతే అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాల వల్ల సంభవించే ప్రమాదాలపై గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ యోగేశ్వరరావు, తొర్రూరు సీఐ సత్యనారాయణ, గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆకేరు వాగు పరిశీలన..

మరిపెడ రూరల్: మండలంలోని పురుషోత్తమాయగూడెం బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఆకేరు వాగు ప్రవాహాన్ని కలెక్టర్ శశాంక, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మంగళవారం పరిశీలించారు. ఆకేరు పరీవాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో పాత ఇళ్లు, గుడిసెల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. కూలిపోయే పరిస్థితి ఉంటే రెవెన్యూ అధికారులకు సమాచారం అందిస్తే సురక్షిత ప్రదేశాలకు తరలిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కేలోతు ధన్‌సింగ్, తహసీల్దార్ పిల్లి రాంప్రసాద్, మరిపెడ ఎస్సై పవన్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నెల్లికుదురు: మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన ఎస్పీ

పాలేరు వాగు పరిశీలన..

దంతాలపల్లి: మండల కేంద్రంలో ప్రవహిస్తున్న పాలేరు వాగును ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి కలెక్టర్ శశాంక మంగళవారం పరిశీలించారు. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు వాగులు, అలుగుల వద్దకు వెళ్లి ప్రమాదాలకు గురికావొద్దని సూచించారు. కార్యక్రమంలో తొర్రూరు డీఎస్పీ సంతోష్, తహసీల్దార్ శివాని, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎస్సై రమేష్‌బాబు, ఎంపీఓ అప్సర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉండాలి

మహబూబాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అందుబాటులో ఉండాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో వర్షాలపై ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షితప్రాంతాలకు తరలించాలన్నారు. వాగులు, వంకల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో గర్భిణులను గుర్తించి, ఆరు నెలలు నిండిన వారిని ముందస్తుగా ఆస్పత్రులకు పంపాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలన్నారు.టెలి కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ డేవిడ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఇక మెరుగైన వైద్యం..

- తొర్రూరు పీహెచ్‌సీకి మహర్దశ
- 30 నుంచి 100పడకలకు అప్‌గ్రేడ్
- తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఉత్తర్వులు

తొర్రూరు: తొర్రూరు, చుట్ట పక్కల మండలాల ప్రజలకు స్థానికంగా మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. తొర్రూరు పట్టణం రోజురోజుకూ విస్తరిస్తున్న క్రమంలో వైద్య సేవలు మెరుగుపర్చాలనే ఉద్దేశంతో 30 పడకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేశారు. 100 పడలక ఆస్పత్రిగా మార్పుస్తూ తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా ఏరియా ఆస్పత్రి నిర్మాణానికి రూ.36 కోట్లు కేటాయించింది. కాగా ప్రస్తుతం పీహెచ్‌సీ ఉన్న స్థలంలో నిర్మాణం చేస్తారా.. లేదా మరోచోట నిర్మించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్ణయం తీసుకుంటారా అనేది తేలాల్సి ఉంది.

40 ఏళ్ల క్రితం ఏర్పాటు..

1983లో అప్పటి జనాభాకు అనుగుణంగా తొర్రూరులో 10 పడకల ఆస్పత్రిని నిర్మించారు. చెర్లపాలెం వాసి, అమెరికాలో వైద్యుడిగా స్థిరపడిన డాక్టర్ హనుమాండ్ల రాజేందర్‌రెడ్డి ఆర్థిక సహకారంతో పట్టణంలోని రిక్షాకాలనీ సమీపంలో నిర్మించారు. కొన్నేళ్లక్రితం 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. కాగా నిత్యం ఆస్పత్రిలో 150 నుంచి 200 వరకు ఓపీ రోగులు వైద్య సేవలు పొందుతున్నారు. నెలకు 40 నుంచి 50 వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. మధుమేహం, బీపీ రోగులకు ప్రతినెలా మందులు అందిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డ క్షతగాత్రులను పరీక్షించి ప్రథమ చికిత్స చేస్తున్నారు. కుక్క కాటు, పాము కాటుకు వ్యాక్సిన్ వేస్తున్నారు. వీటితో పాటు చిన్న పిల్లలకు టీకాలు వేస్తున్నారు. క్షయ రోగులకు మందులు అందజేస్తున్నారు. పలు కారణాలతో మరణించేవారి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు.



తొర్రూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

అందుబాటులోకి మెరుగైన వైద్యసేవలు

ఏరియా ఆస్పత్రిగా మారిన తర్వాత 24 గంటల మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటారు. ఓపీ, గర్భిణుల సేవలు పెరుగుతాయి. స్కానింగ్, ఎక్స్‌రే, ఈసీజీ, రక్త, మూత్ర ఇతరత్రా ల్యాబ్‌లు, పరికరాలు అందుబాటులోకి వస్తాయి. గైనకాలజిస్ట్, సర్జన్, పిడియాట్రిక్, అనస్తీషియా వంటి అత్యవసర వైద్యులతో పాటు ఫార్మసిస్టులు, నర్సులు పెరుగుతారు. శస్త్ర చికిత్సలకు అవకాశం ఉంటుంది. అత్యవసర విభాగాలు, శాఖల వారీగా వైద్యులు ఉండనున్నారు.

నిరీక్షణకు తెర..

తొర్రూరులో ఏరియా ఆస్పత్రి ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు రెండు దశాబ్దాలుగా ప్రయత్నిస్తున్నారు. ప్రతి ఎన్నికల్లో ఇదొక హామీగా మిగిలింది. తొర్రూరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించినప్పటికీ ఏరియా ఆస్పత్రి హామీ మాత్రం నెరవేరలేదు. ఈ ఏడాది జనవరి 4న తొర్రూరుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు వచ్చిన సందర్భంగా మంత్రి దయాకర్‌రావు స్థానిక ఆస్పత్రిని 100పడకలకు పెంచాలని కోరారు. సహచర మంత్రి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన హరీశ్‌రావు ఏరియా ఆస్పత్రి ఏర్పాటుకు అంగీకారం తెలిపారు. 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ పరిపాలనా అనుమతులు రావడంతో దశాబ్దాల నిరీక్షణకు తెరపడింది.

కల నెరవేరింది..



నియోజకవర్గంలో ఏరియా ఆస్పత్రి ఏర్పాటు చేయాలనే నా కల నెరవేరింది. మెరుగైన వైద్యం కోసం గతంలో సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు తొర్రూరులోనే 100 పడకల ఆస్పత్రి అందుబాటులోకి రావడంతో సమస్య తీరుతుంది. రూ.36 కోట్లతో నిర్మాణం చేపడుతాం.

-ఎర్రబెల్లి దయాకర్‌రావు, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి

అప్‌గ్రేడ్ చేయడం హర్షణీయం



తొర్రూరు పీహెచ్‌సీని ఏరియా ఆస్పత్రిగా మార్చుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయం. రోగులు వైద్యసాయానికి సుదూర ప్రాంతాలకు, ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి ఇబ్బందులు పడే అవకాశం ఉండదు. పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. 100 పడకల ఆస్పత్రిగా మార్చేందుకు కృషి చేసిన మంత్రి దయాకర్‌రావుకు కృతజ్ఞతలు.

-గుండాల మురళీధర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

యువత అన్ని రంగాల్లో రాణించాలి

- ఎమ్మెల్యే శంకర్‌నాయక్

మహబూబాబాద్ అర్బన్: యువత అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మంగళవారం యువ ఉత్సవ్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శంకర్‌నాయక్, ట్రైనీ కలెక్టర్ పింకేష్ కుమార్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత ఓటమితో కుంగిపోకుండా.. పట్టుదలతో ముందుకు సాగి విజయాలు సాధించాలన్నారు. యువత చేతిలోనే దేశ భవిష్యత్ ఉందన్నారు. ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ.. యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. యువతలోని నైపుణ్యాలను వెలికితీసేందుకు నెహ్రూ యువజ కేంద్రం యువ ఉత్సవ్ నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం యువకులకు సాంస్కృతిక, వక్తృత్వ, పెయింటింగ్, పద్య రచన, మొబైల్ ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, కౌన్సిలర్ మార్నేని వెంకన్న, యువజన అధికారి అన్వేష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీధర్, గురుకుల పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ నాయకులు గోగుల రాజు, కర్పూరపు గోపి, దౌలగర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

ఎంబీఏ నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి ఎంబీఏ నాలుగో సెమిస్టర్ (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) (2022–23) పరీక్షల ఫీజు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఆగస్టు 5వ తేదీ వరకు చెల్లించవచ్చని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. రూ.250 అపరాధ రుసుముతో ఆగస్టు 8వ తేదీతో పరీక్ష ఫీజు చెల్లించవచ్చని, రెగ్యులర్ విద్యార్థులు రూ.1,380 ఫీజు చెల్లించాలని సూచించారు. బ్యాక్‌లాగ్స్ రెండు పేపర్ల వరకు రూ.500, రెండు పేపర్లకు పైన రూ.950, ఇంప్రూవ్‌మెంట్ ప్రతీ పేపర్‌కు రూ.300ల చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి

- సీపీఐ, సీపీఎంల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ధర్నా

మహబూబాబాద్: మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసీ మహిళలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు దారుణమని, తక్షణమే అక్కడి బీజేపీ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథిరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రెండు పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మణిపూర్‌లో మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నా పీఎం మోదీ స్పందించకపోవడం సరికాదన్నారు.



తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

'సేవ్ మణిపూర్..సేవ్ ఇండియా' అనే నినాదంతో ప్రతి ఒక్కరు ముందుకెళ్లాలన్నారు. అత్యాచారాలు, హత్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అజయ్‌సారథిరెడ్డి, ఆకుల రాజు, గునిగంటి రాజన్న, పెరుగు కుమార్, నవీన్, సమ్మెట రాజమౌళి, సాంబలక్ష్మి, వెంకన్న, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

మీనం.. ఘనం..

- వేర్వేరు చోట్ల వలలకు చిక్కిన పెద్ద చేపలు

చిల్పూరులో 12 కిలోల పాపర చేప..



పాపర చేపతో లింగయ్య

చిల్పూరు: జనగామ జిల్లా చిల్పూరు మండల కేంద్రంలోని ఆకేరు వాగు చెక్ డ్యాం వద్ద మంగళవారం సాయంత్రం 12 కిలోలు ఉన్న పాపర చేప వలకు చిక్కింది. గ్రామానికి చెందిన దామెర లింగయ్య చెక్‌డ్యాం వద్ద వల వేయగా ఈ చేప చిక్కింది. దీనిని స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

చిన్నోడికి చిక్కిన పెద్ద చేప..



చేపను చూపుతున్న యశ్వంత్

చెన్నారావుపేట: చెన్నారావుపేట శివారులోని కోపాకుల చెరువు మంగళవారం మత్తడి పోయగా ప్రజలు చేపల వేటకు వెళ్లారు. ఇదే గ్రామానికి చెందిన రాకం యశ్వంత్ కూడా వెళ్లాడు. అక్కడ ఈ చిన్నోడి వలకు పెద్ద చేప చిక్కింది. దీంతో ఆ బుడతడి ఆనందానికి అవధులు లేకుండాపోయింది. మండల కేంద్రానికి తీసుకొచ్చి విక్రయించాడు. 10 కిలోలు ఉండడంతో రూ. 1000 విక్రయించాడు. చిన్నోడికి అదృష్టం కలిసొచ్చిందని పలువురు చర్చించుకోవడం విశేషం.

జంగాలపల్లిలో 6 కిలోల వాలుగ..



వాలుగతో పవన్

ములుగు: ఇటీవల కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఈ క్రమంలో ములుగు మండలం మేడివాగు వద్ద ప్రజలు మంగళవారం చేపలు పట్టారు. ఇందులో జంగాలపల్లి గ్రామానికి చెందిన పవన్ వలకు 6 కిలోల వాలుగ చిక్కింది.

హన్మకొండ: మత్తడి పోస్తున్న భద్రకాళి చెరువు



కురవి : అలుగు పోస్తున్న నల్లెల్ల చెరువు



నర్సింహులపేట : కొమ్ములవంచలో మత్తడి పోస్తున్న కొత్త చెరువు



మత్తళ్లు..పరవళ్లు

ఉమ్మడి జిల్లాలో కుండపోత వర్షం..

- అలుగు పోస్తున్న చెరువులు, కుంటలు
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు, మూడు రోజుల నుంచి కుండపోత వర్షం కురుస్తోంది. దీంతో ఇంత కాలం నెర్రలు బారిన చెరువులు, కుంటలు మత్తళ్లు పరవళ్లు దూకుతున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఫలితంగా కనుచూపు మేర నీరే కనిపిస్తోంది. కాగా, మత్తళ్ల వద్ద ప్రజలు చేపలు పడుతుండడంతో ఆ ప్రాంతంలో సందడి నెలకొంటుంది.

-సాక్షి నెట్‌వర్క్



కాజీపేట : సోమిడిలో పొంగిపొర్లుతున్న ఊర చెరువు

దేవరుప్పుల: మత్తడి పోస్తున్న కడవెండి వాగు





దామెర : మత్తడి పోస్తున్న దామెర గిద్దె చెరువు



నర్సంపేట రూరల్ : మత్తడి పోస్తున్న మాదన్నపేట చెరువు



అలుగుపోస్తున్న మానుకోటలోని నిజాం చెరువు



గంగారం : గంగారంలో మత్తడిపోస్తున్న చెరువు



శాయంపేట : అలుగుపోస్తున్న చలివాగు



సంగెం : మత్తడి పోస్తున్న ఎల్గూర్‌రంగంపేట చెరువు



మహబూబాబాద్‌లోని జమండ్లపల్లి వద్ద మున్నేరు వాగు..



సంగెం : మత్తడి పోస్తున్న కుంటపల్లి చెరువు

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

- అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలి
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

సాక్షి ప్రతినిధి, వరంగల్: వర్షాలు, వరదలపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నమోదవుతున్న వర్షపాతం, వరదలు, లోతట్టు ప్రాంతాల జలమయం, వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, అత్యవసర పరిస్థితుల్లో, రెస్క్యూ టీమ్స్, టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు తదితర అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్లు, సీపీ, ఎస్పీలు, ఇతర అధికారులతో మంగళవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల పరిస్థితి, ముందు జాగ్రత్త చర్యలను కలెక్టర్లు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి దయాకర్ రావు మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో గల జిల్లాల్లో రెడ్ అలెర్ట్ ఉందని, ప్రజలకు ఏ సమస్య ఉన్నా అధికారులకు తెలపాలన్నారు. ఏ సమయంలో ఏ సమస్య వచ్చినా వెంటనే అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అలాగే, జిల్లా కలెక్టరేట్లలో టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివస్తున్న ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలు లేదా పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. కాగా, 2 రోజులుగా కురుస్తున్న వర్షాలపై ఆరా తీసిన మంత్రి.. అధికారులు అందుబాటులో ఉండాలని చెప్పారు. ఇదే సందర్భంలో తాను కూడా సహాయక చర్యలలో పాల్గొంటున్నానని, ప్రజాప్రతినిధులు, యువత కూడా అధికారులకు సహకరించాలని కోరారు.



ఉమ్మడి వరంగల్ కలెక్టర్లు, ఎస్పీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న మంత్రి ఎర్రబెల్లి

బైక్‌ను ఢీకొన్న ట్రాలీ ఆటో

- వాహనదారుడి దుర్మరణం

గార్ల: ఎదురుగా అతివేగంగా వచ్చిన ఓ ట్రాలీ ఆటో..బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతిచెందాడు. గార్ల మండలం అంజనాపురం గ్రామానికి చెందిన సపావట్ శివ(30) పెద్ద కుమారుడు గత ఏడాది కారేపల్లి మండలం గాంధీపురంలోని గిరిజన గురుకుల పాఠశాలలో చదువుకున్నాడు. ఈ ఏడాది గార్లలోనే చదువుకుంటానని తెలుపడంతో శివ.. మంగళవారం ఉదయం కుమారుడి టీసీ తీసుకొచ్చేందుకు బైక్ పై బయలుదేరాడు. ఈ క్ర మంలో కారేపల్లి మండలం ఊట్కూరు స్టేజీ వద్ద ఎ దురుగా అతి వేగంగా వస్తున్న ట్రాలీ ఆటో బైక్‌ను ఢీకొంది. దీంతో శివ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



శివ (ఫైల్)

చికిత్స పొందుతున్న మహిళ మృతి

నర్మెట : పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని వెల్దండలో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం సిద్దిపేట జిల్లా కొమురవెల్లికి చెందిన దొడ్ల వెంకటమ్మ, సిద్దయ్య దంపతుల కూతురు కవిత (28)కు మండలంలోని వెల్దండకు చెందిన బైరగోని కౌసల్య, ఎల్లయ్య దంపతుల కుమారుడు సాంబయ్యతో 2014లో వివాహం జరిగింది. ఈక్రమంలో దంపతుల మధ్య తరచూ గొడవలు చోటు చేసుకోవడంతో పెద్దమనుషులు పలుమార్లు సర్దిచెప్పారు. కాగా, ఆదివారం రాత్రి సాంబయ్య చేయి చేసుకోవడంతో మనస్తాపం చెందిన కవిత పురుగుల మందుతాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు జనగామ ఏరియా ఆస్పత్రికి.. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం తరలించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా మంగళవారం మృతి చెందింది. ఈ ఘటనపై భర్త,అత్త మామల వేధింపులే కారణమంటూ మృతురాలి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.



కవిత (ఫైల్)

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి మంగళవారం ఆత్మహత్యకు యత్నించాడు. కొన్ని రోజుల నుంచి మానసికంగా ఇబ్బంది పడుతున్న ఆ విద్యార్థికి తల్లిదండ్రులు చికిత్స నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సహా విద్యార్థులతో తనకు చనిపోవాలని ఉందని చెప్పి వెంట తెచ్చుకున్న ఎలుకల మందు తాగాడు. వెంటనే తోటి విద్యార్థులు ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వగా చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ విద్యార్థి క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయంపై ఎంఈఓ పూల్‌చంద్‌ను వివరణ కోరగా మానసికంగా ఇబ్బంది పడుతూ విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు తెలిసిందన్నారు. దీనిపై విచారణ చేపడుతామన్నారు.

నీరు వెళ్లే దారేది...



చిన్నవడ్డేపల్లి చెరువు మత్తడి వద్ద మూసి ఉన్న తూము.. పైనుంచి పోతున్న వరద నీరు

- గుడిసెలు వేసి అడ్డుగా మట్టి పోసి
- అవుట్ ఫ్లో లేక..ముంపులోనే కాలనీలు..
- పనిచేయని తూములు..
- పట్టించుకోని అధికారులు

వరంగల్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శివారు ప్రాంతాల్లో సైడ్‌కాల్వలు, కల్వర్టులు, బాక్స్ డ్రెయిన్ల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు కేటాయించడంతో రెండేళ్ల క్రితం పనులు ప్రారంభమయ్యాయి. రెండు వర్షాకాలాలు పోయినప్పటికి పనులు పూర్తి కాకపోవడంతో శివారు ప్రాంతమైన 14, 18వ డివిజన్‌లలో పలు కాలనీలు ఆదివారం నుంచి కురిసిన భారీ వర్షంతో జలమయమయ్యాయి.

గుడిసెలు వేసి.. అడ్డుగా మట్టి..

చిన్నవడ్డేపల్లి చెరువులో వామపక్ష పార్టీల అధ్వర్యంలో గుడిసెలు వేసిన వారు పై ప్రాంతాలనుంచి చెరువులోకి వచ్చే కాలువకు అడ్డంగా మట్టిపోయడంతో వర్షపు నీరు ఎక్కడిక్కడే నిలిచిపోయింది. గత వారం కమిషనర్ వచ్చి అడ్డుగా ఉన్న మట్టి తీయాలని ఆదేశించగా తూతూమంత్రంగా తీయడంతో మళ్లీ నీరు నిలిచింది. దీనికి తోడుగా వరద వచ్చినప్పుడు అదనంగా నీరు పోయేందుకు మత్తడిపై రెండు తూములు ఏర్పాటు చేశారు. ఈ తూములను ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఒక తూము పూర్తిగా మూసి ఉండడం కూడా కాలనీలు మునిగిపోయేందుకు కారణంగా భావిస్తున్నారు. ఒక తూము తీసినా పైనుంచి వచ్చే వరద మత్తడి పైనుంచి పోయింది. మరో తూము తీస్తే కాలనీలు మునక బారినుంచి బయటపడే అవకాశాలున్నాయి.

ఇన్‌ఫ్లో ఎక్కువ..అవుట్ ఫ్లో తక్కువ..

కాలనీల్లో పడిన నీరు పెద్ద మొత్తంలో బయటకు పోయే వీలు లేనందునే ముంపునకు గురవుతున్నాయి. నగరంలోని 18, 19, 14, 4వ డివిజన్లలో వర్షపు నీరు గరీబ్‌నగర్, 100ఫీట్లరోడ్డు, గాంధీనగర్, ఎస్ఆర్‌నగర్, లక్ష్మీగణపతికాలనీ, శ్రీసాయిగణేష్ కాలనీల మీదుగా చిన్నవడ్డేపల్లి చెరువులోకి వెళ్లాల్సి ఉంది. కానీ ఏనుమాముల రహదారి అడ్డంగా ఉండడం, నీరు వెళ్లేందుకు సరైన అవుట్ లెట్‌లను ఏర్పాటు చేయకపోవడం వల్ల పై కాలనీలు అన్ని రోజుల తరబడి ముంపులోనే ఉంటున్నాయి. కాశిబుగ్గ–ఏనుమాముల ప్రధాన రహదారి మధ్యలో రెండు చోట్ల అవుట్‌లెట్‌లు నిర్మించాల్సి ఉండగా తాగు నీటి పైపులైన్లు అడ్డుగా ఉన్న కారణంగా ఒకే చోట రెండు పైపులతో కల్వర్టులు నిర్మించినా వరద మాత్రం తగ్గలేదు. నాలుగు డివిజన్లలోని ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు ఒకేచోట నుంచి పోవడం వల్ల ఈపరిస్థితులు నెలకొన్నాయి. ఈ ప్రాంతంలో నీరు చెరువులోకి పోకపోవడంతో పెట్రోల్‌బంకు వరకు వరద నిలిచిపోయింది.



మళ్లీ మునిగిన 14వ డివిజన్‌లోని లక్ష్మీగణపతి, మధురానగర్ కాలనీలు

పైపులు వేయడంలో నిర్లక్ష్యం..



ఏనుమాముల బాలాజీనగర్-నర్సంపేటరోడ్డు వరకు ఉన్న 100ఫీట్ల రోడ్డుపై ఆనకొండలా ఉన్న డ్రైయిన్ నిర్మాణం కోసం తెచ్చిన పైపులు

నర్సంపేట రోడ్డు నుంచి ఏనుమాముల బాలాజీ జంక్షన్ వరకు నిర్మించిన స్మార్ట్ రోడ్డుకు ఇరువైపులా డ్రెయిన్ నిర్మించాల్సి ఉంది. కాంట్రాక్టర్ తన స్వలాభం కోసం డ్రెయిన్ స్థానంలో పైపులు వేసేందుకు మార్పులు చేయించుకున్నాడు. పైపులు రోడ్డు మధ్యలో స్టాక్ పెట్టి 6నెలలు దాటింది. వాటిని వేయాలని చెప్పే ధైర్యం అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు లేకుండా పోయింది. సదరు కాంట్రాక్టర్ అధికార పార్టీ ఎమ్మెల్యేకు సోదరుడు కావడమే కారణంగా తెలుస్తోంది. ఈ ఏరియా మరో ఎమ్మెల్యే పరిధిలో ఉన్నప్పటికి ఆయన కూడా చెప్పలేని స్థితిలో ఉన్నట్లు తెలిసింది. ఈ విషయం ముంపు పరిశీలనకు వచ్చి మంత్రి దయాకర్‌రావు దృష్టికి తీసుకెళ్లగా మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

లైంగిక వేధింపులు..

- వివాహిత ఆత్మహత్య

వర్ధన్నపేట : లైంగిక వేధింపులతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు గ్రామానికి చెందిన పస్తం శ్రీనుకు 2006 సంవత్సరంలో మంజుల (34)తో వివాహం జరిగింది. బతుకుదెరువు నిమిత్తం 10 సంవత్సరాల క్రితం ముంబై వెళ్లిన దంపతులు.. మూడు నెలల క్రితం ఇంటికి చేరుకున్నారు. ఈక్రమంలో మండలంలోని ఎలికట్ట గ్రామం టిక్యతండాకు చెందిన జాటోత్ జితేందర్‌కు తమ ఇంట్లోని ఓ గదిని అద్దెకు ఇచ్చారు. ఈ నేపథ్యంలో జితేందర్ తరుచూ మంజులను లొంగదీసుకోవాలని యత్నించాడు. దీనిపై తొర్రూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు జితేందర్‌కు కౌన్సెలింగ్ నిర్వహించారు. అయినా ఆయనలో మార్పు రాకపోవడంతో మరోసారి పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. ఈ వేధింపులు తాళ లేక మంజుల 15 రోజుల క్రితం తన సోదరి శారద ఇంటికి వెళ్లింది. అక్కడ మంజులకు మాయమాటలు చెప్పిన జితేందర్.. వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలోని తన గదికి తీసుకెళ్లాడు. అక్కడ లైంగిక దాడికి యత్నించడంతో మంజుల ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా వరంగల్ ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. ఈ ఘటనలో లైంగిక వేధింపులు తట్టుకోలేక తన భార్య మంజుల ఆత్మహత్యకు పాల్పడిందని భర్త శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.



మంజుల(ఫైల్)

మహిళ బలవన్మరణం

వరంగల్ క్రైం : భర్తతో పాటు కుటుంబ సభ్యుల వేధింపులతో ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధి న్యూశాయంపేటలోని బొల్లెనవాడకు చెందిన జంగ్లీ నిఖిత (21) ఈనెల 24న రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి యేసోబు ఫిర్యాదు మేరకు మృతురాలి భర్త మహ్మద్ హసనుద్దీన్, కుటుంబ సభ్యులు సుల్తానా, కమాలుద్దీన్, యాకూబ్‌పై కేసు నమోదు చేసినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షుకుర్ తెలిపారు.



నిఖిత మృతదేహం